క్లుప్తంగా

సమాన అవకాశాలు కల్పించాలి



తైక్వాండో క్రీడాకారిణులను సన్మానించిన డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): సమాజంలో స్త్రీ, పురుషులు అనే వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్‌లోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తైక్వాండో క్రీడాకారిణులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు అవకాశాలు కల్పిస్తే పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. రాజకీయ, క్రీడారంగంలో మహిళలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

కర్నూలు సిటీ: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ సరెండర్ లీవ్స్, జెడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు షన్ముర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు



అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో, భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం రఘునందన సేవక్ ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం



అనఘా స్వామికి హారతి ఇస్తున్న పురోహితుడు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనఘా దేవి సమేత అనఘా స్వామికి అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకారం తదితర విశేష పూజలు జరిగాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రంగముని సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి పూలమాల వేస్తున్న వక్తలు

కర్నూలు కల్చరల్ : పద్యనాటక రంగానికి గురువుగా రంగముని అందించిన సంగీత సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో రంగముని 7వ వర్ధంతి సభ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. రంగముని హార్మోనిస్టుగా ఎందరో శిష్యులను తయారు చేశారన్నారు. ఈ సందర్భంగా సంగీత గురువులు బాలు, అనితలను సత్కరించారు. స్వర దాసరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు, శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు అలరించాయి. సాహితీ సవంతి అధ్యక్షుడు బసవరాజు, కన్వీనర్ జేఎస్ శేషయ్య, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కైక మురళీ కృష్ణ, బంగి శ్రీధర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్,



ప్రార్థనలో పాల్గొన్న ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్లతో సమావేశం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరం నుంచి ఇప్పటికే రెండుసార్లు గెలిచాం. 2024 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ ముఖ్యులు, నాయకులు, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలను పొందిందన్నారు. ఇంటింటికీ సంక్షేమం, వాడవాడలో అభివృద్ధి పనులు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నవాళ్లకే ఊడిగం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగనన్న అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి కర్నూలులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఇంతియాజ్‌ను గెలిపిద్దాం

కర్నూలు (టౌన్) : అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కర్నూలు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్‌ను గెలిపించుకుందామని కర్నూలు నగర పాస్టర్లు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్వీ మోహన్ రెడ్డి స్వగృహంలో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్లు అభ్యర్థి ఇంతియాజ్ గెలుపు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాలువా కప్పి సత్కరించారు. పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవ సమజానికి ఎస్వీ కటుంబం అండగా నిలిచిందన్నారు. అడిగిన వెంటనే తమకు బరియల్ గ్రౌండ్ మంజూరు చేయించారని చెప్పారు. పేద ప్రజలను, అన్ని వర్గాలను ఆదుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని మరోసారి గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ ప్రభుత్వంలోనే పాస్టర్లకు, క్రైస్తవులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏప్పుడూ లేని విధంగా పేద పాస్టర్లను అదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగనన్న నియమించిన మన అభ్యర్థి ఇంతియాజ్‌ను క్రైస్తవులంతా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఇంతియాజ్ మాట్లాడుతూ నాలుగున్న సంవత్సరాల జగనన్న పాలనలో అందరికీ మేలు జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, జగనన్న విధానాలు నచ్చి తాను ప్రజలకు సేవ చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. నగర ప్రజలు తనకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, పాస్టర్లు పాల్గొన్నారు. అంతకు ముందు కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్ స్థానిక సి.క్యాంపులోని ప్రార్థనా మందిరానికి వెళ్లారు. పాస్టర్ కరుణ సాగర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న వారితో డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. కర్నూలు రూరల్, అర్బన్ మండల పరిధిలో, గూడూరు నగర పంచాయతీ పరిధిలోని బాధితులకు మంజూరైన రూ.17 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం నగరంలో క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. తొలిశాపురం సుజాతమ్మకు రూ.2లక్షలు, బి.తాండ్రపాడుకు చెందిన అక్బర్ బాషాకు రూ.లక్ష, ఎల్ల నాగమ్మకు రూ.5లక్షలు, గొందిపర్ల సువర్ణకి రూ2లక్షలు, పసుపులకి చెందిన సుమలత రూ.2 లక్షలు, మునగాలపాడుకు చెందిన నాగమణికి రూ.లక్ష అందజేశారు. వారు మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25లక్షలకు పెంచారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పేదలకు అమలు చేసిన ఏకైన సీఎంగా జగననన్న సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు.

మహిళలు ముందుకు రావాలి



కవిత్రి మొల్ల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సు కోసం మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం), కందనవోలు కవయిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని తెలుగు తోటలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చెందామని అనుకుంటున్నప్పటికీ మహిళకు అభద్రత, అన్యాయాలు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. బాలిక అంటేనే వద్దు అనుకునే సమాజం ఇంకా ఉందని, దీనిపై అవగాహన తీసుకురావడానికి మనం ఎంతో కృషి చేయాల్సి ఉందన్నారు. నరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబొయిన పార్వతి దేవి మాట్లాడుతూ కవయిత్రులు కేవలం రచనలతో సరిపెట్టుకోకుండా సమాజ సేవ చేయాలని, సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని కోరారు. డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ మహిళలు, చైతన్యవంతులు కావాలని, తమను తాము ఉత్సాహపరచుకుంటూ అన్ని విషయాల్లో ఆసక్తిని కనబరుస్తూ ముందుకు సాగాలన్నారు. సదస్సులో దుర్గాబాయి, సావిత్రిబాయి పూలే, కర్నూలు కవయిత్రి చక్కిలం విజయలక్ష్మిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసం మహిళలంతా సమాజ సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మహిళలంతా కలసి కండే సునీత నేతృత్వంలో 'కందనవోలు నవనారి కవన విజయం' అనే రూపకాన్ని ప్రదర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. నరసం అధ్యక్షురాలు కావ్యం సుబ్బలక్ష్మి, విజయ దుర్గ జ్యోతిర్మయి, విజయమ్మ, రజనీ కల్కూర, స్వర్ణలత, పద్మలత, జేఎస్ఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



డాక్టర్ భవాని ప్రసాద్‌ను సత్కరిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు (టౌన్) : ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కర్నూలు వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్ సమావేశ హాలులో పెద్దలకు వ్యాక్సినేషన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలి దశలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. అనంతరం డాక్టర్ భవాని ప్రసాద్‌ను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దైవజ్ఞానాన్ని పొందాలి

కర్నూలు కల్చరల్: శివరాత్రి అంటే మాయ పట్ల జాగృతి జ్ఞానం పొంది ఇతరులకు కూడా తెలియజేయడమని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు నాగయ్య అన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని పలు కాలనీల్లో త్రైత సిద్ధాంత ప్రచారం నిర్వహించారు.

కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.154 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

రూ.6 కోట్లతో జెంబోషెడ్ నిర్మాణం



జంబోషెడ్‌కు జీఐ ప్రొఫైల్ షీట్స్ వేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో 150 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పుతో జెంబోషెడ్ నిర్మిస్తున్నారు. వ్యవసాయ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం జెంబోషెడ్ నిర్మిస్తోంది. 2023లో పనులు ప్రారంభయ్యాయి. సిమెంటు, కాంక్రిట్ పనులు ఇది వరకే పూర్తయ్యాయి. పైకప్పును జీఐ ప్రొఫైల్ షీట్‌లతో వేయాలి. ఇందుకు రూ.కోటి ఖర్చు అవుతుంది. ఈ షీట్‌లు వేసే పనులను కేవలం రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకుంది. ప్రత్యేక మిషనరీ ద్వారా ఈ షీట్లు వేసే పనులను మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక మిషన్‌తో షీట్లు వస్తుండటం వల్ల పనుల్లో నాణ్యతతో పాటు సత్వరం పనులు పూర్తి అయ్యే అవకాశం ఏర్పడింది. మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు జీఐ ప్రొఫైల్ షీట్లు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 10వ తేదీలోపు జెంబోషెడ్‌ను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు పాలక వర్గం చర్యలు చేపట్టింది.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని యూనియన్ బ్యాంక్ కర్నూలు రీజినల్ హెడ్ పి.నరసింహరావు అన్నారు. ఆదివారం చిదంబరావుపీధిలోని అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 30 వార్షికోత్సవం ఇల్లూరు రంగస్వామి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ నిరుపేద బాలుర కోసం ఏర్పాటైన అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహాన్ని గత 29 సంవత్సరాలుగా విజయంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి విద్యను అభ్యసించాలన్నారు. దేశభక్తి, నైతిక విలువలు కలిగి, దేశానికి ఉపయోగ పడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతపురం సహ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్, సంస్కృత అధ్యాపకులు మాలపాటి శ్రీనివాసరెడ్డి సందేశమిచ్చారు. వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వసతి గృహ అధ్యక్షులు చిరంజీవిరెడ్డి, కార్యదర్శి బాలాజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిదాలపాడులో పల్స్ పోలియో

కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని మామిదాలపాడులో ఆదివారం పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వై.రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పసి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు నిరుపమా, అంగన్‌వాడీ టీచర్లు వై.సుజాత, రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నిల్వ పద్ధతులపై అవగాహన పెంచండి

- దేశీ శిక్షణ కార్యక్రమంలో నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణరావు



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): పంట నిల్వ పద్ధతులపై రైతులకు అవగాహన పెంచాలని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ.. తగిన జాగ్రత్తలు తీసుకుంటే పండించిన పంటలు దెబ్బతినకుండా నిల్వ చేసుకోవచ్చన్నారు. గోదాములో తేమ లేకుండా చూసుకోవాలని, పురుగు పట్టకుండా సిఫారస్సు మేరకు తగిన కెమికల్స్ వినియోగించాలన్నారు. దేశీ సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ.... వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత పెరిగిందని, దీనిపై ఇన్‌పుట్ డీలర్లు అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం చల్ల'కుండ'



- మట్టిపాత్రల్లో చేసే ఆహారంతో ఆరోగ్యం పదిలం
- కుండల్లోని నీటితో అనేక ప్రయోజనాలు
- వేసవిలో పేదల ఫ్రిజ్‌కు భలే డిమాండ్
- మార్కెట్‌లో అభిరుచులకు అనుగుణంగా మట్టిపాత్రలు, కుండలు లభ్యం

ఒకప్పుడు మన జీవితాలతో మట్టి పాత్రలు, కుండలు మమేకమై ఉండేవి. మారిన జీవనశైలి.. స్టీల్, ప్లాస్టిక్, పింగాణి, గాజు పాత్రలు రావడంతో వాటి వాడకం పూర్తిగా తగ్గిపోయింది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు మళ్లీ ఎక్కువ మంది మట్టి కుండలు, మట్టి పాత్రల వినియోగంపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో చేసే వంటకాలు రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు ఉండడమే ఇందుకు కారణం.



పెద్దమార్కెట్ వద్ద మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కర్నూలు (న్యూటౌన్): ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పేదోడి ఫ్రిజ్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో చేసిన ఆహారం తినడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో ధనవంతులు కూడా మట్టి కుండలోని నీటిని తాగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల మట్టి కూజాలు, కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు, వాటర్ క్యాన్లు, టీ గ్లాసులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

కుండలోని నీరు శ్రేష్టమైంది

మట్టి కుండలకు సహజ సిద్ధంగా తాగునీటిని చల్లబరిచే గుణముంది. మట్టికుండలో నీటిని నిల్వ చేసుకుంటే చల్లగా ఉండడంతో పాటు ఖనిజ లవణాలు నిల్వ ఉంటాయి. మట్టికుండలో నీటిని పోస్తే సూక్ష్మ రంధ్రాల ద్వారా వెచ్చదనం బయటకు వెళ్తుంది. ఆ నీటిని తాగితే శరీరంలో రక్తప్రసరన బాగా జరిగి ఆరోగ్యంగా జీవించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగడంతో గొంతు నొప్పి, శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అయితే మట్టికుండలోని నీటి తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది. పైగా ఎలాంటి రోగాలు రావు. మండుటెండల్లో బయటకు వెళ్లి ఇంటికి వచ్చినప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో ఊరట లభిస్తుంది. కడుపులో మంట, ఇతర జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అతిగా దాహం వేయదు. వడదెబ్బ రిస్క్ కూడా తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

మట్టిపాత్రల్లో చేసిన ఆహారం ఉత్తమం

మట్టి పాత్రలో చేసిన ఆహారం రుచిగా ఉంటుంది. ఆహార పదార్థాల్లో పోషకాలు వృథా కావు. ఆహారంలో యాసిడ్ మట్టి పాత్రల్లోని అల్కలైన్‌తో చర్యకు గురై పీహెచ్ స్థాయిలు తటస్థీకరిస్తుంది. మట్టి పాత్రల్లో చేసిన ఆహారం అన్ని రకాలుగా ఆరోగ్యదాయకం.

వేసవిలో భలే డిమాండ్

ప్రస్తుతం కర్నూలు నగరంలో మట్టి కుండలు, పాత్రలకు భలే డిమాండ్ ఉంది. గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు, జడ్చర్ల, వైఎస్సార్ కడప, అనంతపురం, నంద్యాల, పత్తికొండలో తయారు చేసిన మట్టి కుండలు, వాటర్‌ఫిల్టర్‌లు, నీళ్ల బాటిళ్లు, టీ కప్పులు, కూజాలు, దీపాలు, తులసికోట, బిర్యాని కుండలు, పెరుగు కుండలు, హండీలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.



మట్టితో చేసిన టీ కప్పులు



రంగురంగుల గుజరాత్ మట్టి కుండలు

రోజూ 20-60 కుండలు విక్రయిస్తాం



కులవృత్తిని నమ్ముకుని మట్టి కుండలు, పాత్రలను విక్రయించి జీవిస్తున్నాం. వేసవి కాలంలో మట్టి కుండలతో పాటు మట్టి వాటర్ బాటిల్స్, టీ కప్పులు, వాటర్ ఫిల్టర్‌లు సైజును బట్టి అమ్ముతున్నాం. ప్రతి రోజూ 20 నుంచి 60 వరకు కుండలు విక్రయిస్తాం. మట్టి కుండలు కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.

–శుభాష్, కుండల వ్యాపారి, కర్నూలు

మట్టి కుండలోని నీరు శ్రేష్టం



వేసవిలోనే కాకుండా అన్ని కాలాల్లో మట్టి కుండల్లోని నీరు ఎంతో శ్రేష్టం. ఎండలో బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే ఒక గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో హాయిగా ఉంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో ఎన్నో రకాల ఫ్రిజ్‌లు, వాటర్ ఫిల్టర్లు వచ్చినా మట్టి కుండలోని నీటికి సాటిరావు.

–ఖతీజాబీ, కర్నూలు

ఫ్రిజ్‌వాటర్‌తో ఆరోగ్య సమస్యలు



వేసవి కాలంలో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఫ్రిజ్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు. ఫ్రిజ్‌లోని చల్లటి వాటర్ తాగడం వల్ల గొంతునొప్పి, శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దగ్గు, జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మట్టి కుండలోని నీటిని తాగితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

–డాక్టర్ మీనుగ శ్రీనివాసులు, కర్నూలు